# కపట కాంగ్రెస్‌ను తరిమికొట్టండి

- ఎన్నికల వేళ వచ్చే ప్రతిపక్షాలను నమ్మొద్దు
- 60 ఏండ్లలో చేయని అభివృద్ధిని ఐదేండ్లలో చేసి చూపించాం
- ఎన్నికల హామీలను నెరవేర్చాం
- బీఆర్ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాల్లో వణుకు
- ఎన్నికల ప్రచార సభలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట, అక్టోబర్ 16 : మోసకారి కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో తరిమి కొట్టాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. బొంరాస్‌పేట మండలం మదన్‌పల్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో, ఎన్నికల ప్రచార రథానికి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి పూజలు నిర్వహించిన అనంతరం ఆయన బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారని, ఇలాంటి పార్టీలను ప్రజలు నమ్మరాదని సూచించారు. కొడంగల్ నియోజకవర్గంలో 60 ఏండ్లలో చేయని అభివృద్ధి పనులను ఐదేండ్లలో చేసి చూపించామని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను చూసి ప్రతిపక్ష పార్టీలకు వణుకు పుడుతున్నదని పేర్కొన్నారు. మహిళలకు రూ.400కే వంట గ్యాస్ సిలిండర్, పేద మహిళలకు నెలకు రూ.3 వేలు, ఆసరా పింఛన్లు రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంపు, రూ.5 లక్షల కేసీఆర్ బీమా, రైతుబంధు ద్వారా రూ.16 వేల పెట్టుబడి సహాయం వంటి ప్రజామోదయోగ్యమైన పథకాలను బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. కొడంగల్‌లో మరోసారి పట్నం నరేందర్‌రెడ్డిని ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మహేందర్‌రెడ్డి అన్నారు.

కార్యక్రమంలో బొంరాస్‌పేట, దుద్యాల, కోస్గి, కొడంగల్, మద్దూరు మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు యాదగిరి, చాంద్‌పాషా, హన్మంత్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకటయ్య, బొంరాస్‌పేట జడ్పీటీసీ చౌహాన్ అరుణాదేశు, వైస్ ఎంపీపీ శ్రావణ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, నారాయణపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీలు నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పార్టీ నాయకులు మధుయాదవ్, దేశ్యానాయక్, రమణారెడ్డి, టీటీ రామూనాయక్, బాబర్, నరేశ్‌గౌడ్, మహేందర్, వాహబ్, సలాం, రవిగౌడ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలున్నారు.


మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

### బీఆర్ఎస్‌లో చేరిక

మదన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బాబయ్య, రమేశ్, బాబు, శివకుమార్, అంజయ్య, ముద్దప్ప, నరేశ్, గోపాల్ తదితరులు మంత్రి, ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మహేందర్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### ఘన స్వాగతం

మండలం నుంచి ప్రచారం ప్రారంభించడానికి వచ్చిన మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిలకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి, ఎమ్మెల్యేపై పూలుచల్లి స్వాగతించారు. పెద్దఎత్తున పటాకులు కాల్చారు. మదన్‌పల్లి నుంచి 500 బైకులతో ర్యాలీ నిర్వహించారు.

### ప్రచారానికి విశేష స్పందన

మండలంలో మంత్రి, ఎమ్మెల్యే నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సభలకు జనం పెద్దఎత్తున హాజరయ్యారు. బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన వాటి గురించి మంత్రి, ఎమ్మెల్యే వివరిస్తున్నప్పుడు ప్రజలు చప్పట్లు కొట్టి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

### సైనికుల్లా పనిచేయాలి

వచ్చే ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కొడంగల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మదన్‌పల్లి, మదన్‌పల్లితండా, బురాన్‌పూర్, సూర్యానాయక్‌తండా, గట్టిగానితండా, టేకులగడ్డతండా, సాలిండాపూర్ గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజలకు ఆమోదయోగ్యమైన పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పే మోసపూరిత హామీలకు మోసపోరాదని ప్రజలకు సూచించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దేశమే కాపీ కొడుతున్నదని, అలాంటిది కాంగ్రెస్ హామీలను కాపీ కొట్టే కర్మ తమకు ఏముందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి సంక్షేమ పథకాలను అమలు చేయడం చేతకాదని, తమ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను అడ్డుకోవడానికి మాత్రం చేతనైతదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తండాలకు గుర్తింపు వచ్చిందని, రూ.200 కోట్లతో తండాలకు బీటీ రోడ్లు నిర్మించామని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో సాగు నీరందిస్తామని చెప్పారు. చెప్పింది చేసిచూపడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఐదేండ్లలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేశానని, రెండోసారి గెలిపిస్తే ప్రజలకు సేవకుడిలా పని చేస్తానని హామీ ఇచ్చారు. కేసీఆర్ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు.


సూర్యానాయక్‌తండాలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

# సకల జనులు బీఆర్ఎస్ వైపే..

- గులాబీ జెండాతోనే ఘనమైన అభివృద్ధి
- పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపునిస్తాం
- ఎమ్మెల్యేలు ఆనంద్, కిషన్‌రెడ్డి, అంజయ్యయాదవ్, యాదయ్య, జైపాల్‌యాదవ్
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన పలు పార్టీల శ్రేణులు పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరిక

ధారూరు, అక్టోబర్ 16: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఘనమైన అభివృద్ధి జరుగుతున్నదని, గులాబీ గళమే తెలంగాణకు బలమని, పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపునిస్తామని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే ఆనంద్ ఆధ్వర్యంలో ధారూరు మండల పరిధిలోని ధారూరు స్టేషన్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవీణ్, అవినాష్ తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కొత్తగడికి చెందిన పలు పార్టీల శ్రేణులు 80 మంది పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలోఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ధారూరు మండల నాయకులు, ఉద్యమకారులు ఉన్నారు.


ధారూరు : గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

### బీఆర్ఎస్‌ను గెలిపించాలి

యాచారం : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి తిరిగి కొనసాగాలంటే మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్శితులై మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు 100 మందికి పైగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, నాయకులు క్యామ మల్లేశ్, ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మండలంలోని నందివనపర్తి గ్రామానికి చెందిన బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు, యాచారానికి చెందిన మాజీ ఎంపీటీసీ దశరథ, టీడీపీ సీనియర్ నాయకులు జోగు కృష్ణ, గడల శ్రీనివాస్, నారిమల్ల యాదయ్య, దేవరకొండ యాదయ్య, గంజి యాదయ్య తమ కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి బాషా, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదయ్య, డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి

షాద్‌నగర్ : సకల జనులు బీఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నారని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. సోమవారం చౌదరిగూడలో పలువురు మైనార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. ఎక్బాల్, మహమూద్, ఇస్మాయిల్, సమ్మద్ వంటి మైనార్టీ నేతలు పార్టీలో చేరడం సంతోషకరమని, పార్టీ గెలుపు కోసం తీవ్రంగా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులున్నారు.

### బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

శంకర్‌పల్లి : తెలంగాణ రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మున్సిపాలిటీ బుల్కాపూర్ వార్డుకు చెందిన 100 మంది బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కౌన్సిలర్ గోపాల్ ఉన్నారు.


శంకర్‌పల్లి : బీఆర్ఎస్‌లో చేరినవారితో ఎమ్మెల్యే యాదయ్య

### అభివృద్ధిని చూసి చేరికలు

మొయినాబాద్ : బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఏఎంసీ వైస్ చైర్మన్ ఎంఏ రవూఫ్, బీఆర్ఎస్ లీగల్ సెల్ మండల అధ్యక్షుడు సురేందర్‌గౌడ్, యువజన విభాగం మండల అధ్యక్షుడు పరమేశ్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, కాంగ్రెస్ పార్టీ వచ్చేది కాదు.. చచ్చేది అని భావించిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై..

కడ్తాల్ : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం కడ్తాల్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడ్తాల్, సాలార్‌పూర్ గ్రామాలకు చెందిన యాదగిరి, రామస్వామి, కృష్ణ, కరుణాకర్, రాములు, అంజయ్య, లింగం, నర్సింహ, పెంటయ్య, రమేశ్, సిలారి లక్ష్మయ్య, జంగయ్య, నవీన్, వెంకటయ్య గౌడ్, గోపాల్, శివ, మహేందర్, రవి, శ్రీను, శ్రీకాంత్, లాలూనాయక్, మహేశ్, సురేశ్, గోపీనాయక్, రామచంద్రయ్య, మల్లేశ్, రాజీవ్‌తో పాటు మరో 100 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీలున్నారు.


పార్టీలో చేరిన నందివనపర్తి యువకులకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి


ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న మైనార్టీ నాయకులు


కడ్తాల్ : బీఆర్ఎస్‌లో చేరినవారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్